క్లుప్తంగా

యాగంటిలో వేలంపాట వాయిదా



వేలం పాటలో పాల్గొన్న ఆలయ అధికారులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మంగళవారం వేలం పాటలు నిర్వహించగా పలు కారణాలతో వేయిదా పడ్డాయి. ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి. కాగా తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన వేలంలో అనుకున్నంత ధర రాకపోవడంతో వాయిదా వేశారు. టెంకాయల విక్రయాల హక్కుకు పాటదారులు డిపాజిట్ చెల్లించారు. అయితే ఆలయ అధికారులు వ్యాపారులకు సరైన వసతి కల్పించడంపై హామీ ఇవ్వకపోవడంతో వారు వేలంలో పాల్గొనలేదు. దీంతో వాయిదా పడ్డాయి. పాటదారులకు వసతి కల్పించడంలో దేవదాయశాఖ, పురావస్తుశాఖ మధ్య సమన్వయం లేకపోవడంతో వాయిదా పడినట్లు భక్తులు, పాటదారులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 17న మళ్లీ నిర్వహిస్తామని ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణి హెల్త్ రిపోర్టును పరిశీలిస్తున్న వైద్యాధికారిణి

ప్యాపిలి: స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులు వాణిశ్రీ, నిలేష్ 59 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి వారిలో ఇద్దరిని డోన్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలకు హాజరు కావాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం తల్లీబిడ్డ ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. సీహెచ్ఓ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడ్, గంగాదేవి, మనోహర్ రెడ్డి, స్టాఫ్ నర్స్ రోజా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడం మానవ ధర్మం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్ టౌన్: వరద బాధితులను ఆదుకోవడం మానవ ధర్మం అని ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకుల సహకారంతో సేకరించిన విరాళాలు, నిత్యావసర సరుకులతో విజయవాడ వెళ్తున్న వాహనాన్ని మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

బేతంచెర్ల: ఆశావర్కర్లకు కనీస వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆశావర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమారి అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.36 లక్షల ఆదాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయం ఆవరణలో పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. టెంకాయల విక్రయం హక్కును ఈ టెండర్ ద్వారా కర్నూలుకు చెందిన బోయిన చింతకుంట రామాంజనేయులు రూ.31,30,000కు దక్కించుకున్నారు. కిరాణ వస్తువుల విక్రయ హక్కును కేవీ పరమేష్ రూ.2,20,000కు దక్కించుకోగా హోటల్ నిర్వహణను రూ.2,75,000కు జి.లక్ష్మీప్రసన్న దక్కించుకున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. కూల్ డ్రింక్స్ నిర్వహణకు సరైన ధర లభించకపోవడంతో వాయిదా వేసినట్లు చెప్పారు. పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరదలు



మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: విజయవాడ, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు వచ్చే సమయంలో వాతావరణశాఖ, నీటిపారుదలశాఖల ప్రభుత్వానికి ముందే సమాచారం ఇచ్చినా.. కృష్ణా నదికి గరిష్ట ప్రవాహం వస్తుందని తెలిసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడం, వారిని రక్షిత ప్రదేశాలకు తరలించడంలో పూర్తిగా విఫలం కావడం వల్లే విజయవాడలో ఇలాంటి పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేవలం సీఎం చంద్రబాబు ఇల్లు మునగకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరు నుంచి వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడలోకి నీళ్లు వదిలారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సహాయక చర్యల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. చాలా మంది ఇంటిలోని వస్తువులన్నీ కొట్టుకుపోయి, తినేందుకు ఏమీ లేక పస్తులతో అలమటించారని..అయినా పట్టించుకోని ఈ ప్రభుత్వాన్ని ఏమనాలో తెలియడం లేదన్నారు. వరద వచ్చిన తర్వాత సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నం చేయడంతో 50మంది వరకు చనిపోయారని, దీనికి చంద్రబాబు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత కూడా కనీస వసతులకు నోచుకోని పరిస్థితి ఉందని, వారం రోజుల పాటు లక్షల మంది నరకయాతన అనుభవించడం బాధాకరమన్నారు. రాజధానిగా చెప్పుకునే విజయవాడలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడంపై సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఇకనైన సీఎం అధికారులను వెంట వేసుకుని తిరగడం మానుకుని వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని హితవుపలికారు.

కరుణించని వరుణుడు

- కొలిమిగుండ్ల మండలంలో రెండు నెలలుగా లోటు వర్షపాతం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో వరి రైతులు
- తగ్గిన సాగు విస్తీర్ణం



నీళ్లు లేక ఎండిపోతున్న వరి పైరు

కొలిమిగుండ్ల: ఎక్కడా చూసిన భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కానీ కొలిమిగుండ్ల మండలంలో మాత్రం విచిత్రమైన పరిస్థితి నెలకొంది. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని నాలుగు మండలాల్లో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాగా కొలిమిగుండ్ల మండలంలో దారుణమైన పరిస్థితి ఏర్పడింది. మిగిలిన మండలాల్లో సాగునీటి ప్రాజెక్టులు, సాగునీటి కాల్వలు ఉండడంతో అక్కడి రైతులు పంటలు పండించుకుంటున్నారు. ఇక్కడ ఎలాంటి సాగునీటి వనరులు లేకపోవడంతో కేవలం వర్షాధారం, బోరు బావుల కింద మాత్రమే పంటలు సాగు చేసుకోవాల్సి వస్తోంది. నామమాత్రంగా కురుస్తున్న వర్షాల వల్ల కంది, మినుము తదితర పంటలకు మాత్రమే కాస్త ఉపశమనం కలుగుతోంది. మండలంలో ఇప్పటి వరకు భారీ వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం. రోజు ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆశగా వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. చివరకు చిరుజల్లులు, మోస్తరు వర్షంతో సరిపెడుతోంది. జూలైలో సాధారణ వర్షపాతం 100.7 మి.మీ కాగా 57.4 మి.మీ వర్షపాతం నమోదైంది. 43.3 మి.మీ లోటు వర్షపాతం ఉంది. ఆగస్టులో 131.5 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా కేవలం 66.4 మి.మీ మాత్రమే నమోదు కావడంతో 65.1 మి.మీ లోటు వర్షపాతం నెలకొంది. సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు మోస్తరు జల్లులే కురిశాయి. రెండు నెలల నుంచి భారీ వర్షపాతం నమోదు కాకపోవడంతో వాగులు, వంకలు, చెరువులు ఎండిపోయాయి.

తగ్గిన వరి సాగు

వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో వరి సాగు పూర్తి స్థాయిలో తగ్గింది. అబ్దుల్లాపురం, కోర్నపల్లె, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె, హనుమంతుగుండం, యర్రగుడి తదితర గ్రామాల్లో వర్షాలు కురుస్తాయనే ఆశలో చాలా మంది రైతులు వరి సాగు చేశారు. తీరా వరుణుడు ముఖం చాటేయడంతో ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో బోర్లలో క్రమేణా నీళ్లు తగ్గిపోతున్నాయి. చాలా మంది రైతులు దాదాపు నెలన్నర క్రితమే వరి సాగు చేసేందుకు నారుమళ్లు పోసుకున్నారు. వర్షాలు కురవకపోవడంతో నాట్లు వేసేందుకు రైతులు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికే కొన్ని చోట్ల నార్లు ముదిరిపోయే స్థితికి చేరుకున్నాయి. వారం రోజుల్లో భారీ వర్షాలు కురవకపోతే నారుమళ్లను తొలగించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం ఈసీజన్‌లో వరి 540 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 222 హెక్టార్లలో మాత్రమే వేశారు. పచ్చగా కళకళలాడాల్సిన వరిమళ్లు బీళ్లుగా మారి పిచ్చి మొక్కలతో కనిపిస్తున్నాయి. ముందుగా వరి వేసిన రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కొలిమిగుండ్లలో వర్షపాతం వివరాలు

నెల	సాధారణం (మి.మీ)	కురిసింది	లోటు
జూలై	100.7	57.4	43.3
ఆగస్టు	131.5	66.4	65.1
ఈ సీజన్‌లో సాగు చేయాల్సిన వరి		540 హెక్టార్లు	
ఇప్పటి వరకు సాగైంది		222 హెక్టార్లు	



బీళ్లుగా మారిన వరిమళ్లు

బోరులో నీరు అడుగంటాయి



రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం బోరులో నీళ్లు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటి వరకు అనుకున్నంత వర్షాలు కురవలేదు. పంట దిగుబడి వచ్చేవరకు బోరులో నీళ్లు ఉండే పరిస్థితి కనిపించడం లేదు. ఊర్లో చాలా మంది రైతులు బీళ్లుగా పెట్టుకున్నారు. వర్షం కురిస్తే గట్టెక్కుతాం.

– రాజు, అబ్దుల్లాపురం

నారు ముదిరిపోతుంది



ఎకన్నరలో వరి సాగు చేసేందుకు సుమారు రెండు నెలల క్రితం నారు పోసుకున్నాను. వర్షం కురిస్తే నాట్లు వేయాలనుకున్నాం. వర్షాలు లేకపోవడంతో ముదిరిపోతోంది. వారం రోజుల వరకు చూసి నారు తొలగించాలనుకుంటున్నాం. బోరులో నీళ్లు అంతంత మాత్రమే ఉండడంతో నాట్లు వేయలేకపోయాం.

– శివరామిరెడ్డి,చింతలాయిపల్లె

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న జడ్జి తంగమణి

డోన్ రూరల్: పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.తంగమణి గర్భిణులు, బాలింతలకు సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్జి హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే వారితో పాటు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మంచిదని తెలిపారు. రక్తహీనత సమస్య నుంచి బయటపడవచ్చన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సీడీపీఓ షంషాద్‌బేగం, హార్టికల్చర్ అధికారి కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణమ్మ, పరమేశ్వరి, పద్మావతి, తిప్పమ్మ, శోభరాణి, సులోచన పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



కొండమనాయునిపల్లెలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ

అవుకు:అవుకు మండలంలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ సూచించారు. మండల పరిధిలోని కొండమనాయునిపల్లె, మారేమడుగుల గ్రామాల్లో సాగు చేసిన మినుము పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో ఈ రెండు గ్రామాల్లో 482 ఎకరాల మినుము పంట సాగైందని తెలిపారు. వర్షభావ పరిస్థితుల కారణంగా కొంతమేర దిగుబడి తగ్గినట్లు గమనించామన్నారు. అయితే రైతులు మినుము పంటను తొలగించి శనగ పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు. దీనికి కావాల్సిన పనులను త్వరలోనే ప్రారంభిస్తారన్నారు. అలాగే మండలంలో దాదాపు 14వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయని, ప్రతి ఒక్క రైతు ఈనెల 15వ తేదీ లోపు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని సూచించారు.

బాలికల చదువు.. ఇంటికి వెలుగు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమీల

బనగానపల్లె రూరల్: బాలికలను బాలురతో సమానంగా చూడాలని..బాగా చదివిస్తే మంచి స్థాయికి చేరుకుని కుటుంబానికి అండగా నిలుస్తారని బనగానపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమీల అన్నారు. మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఎందులోనూ తక్కువ కాదన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి చదవాలని సూచించారు. సెల్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ విద్యపైనే దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహాలతో పిల్లలు జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. పిల్లలకు విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బయన్న పాల్గొన్నారు.

నేడు కోవెలకుంట్లలో గణేష్ నిమజ్జనం

కోవెలకుంట్ల: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఆయా కాలనీల్లో కొలువుదీరిన గణనాథులు నాలుగు రోజుల నుంచి పూజలందుకుంటున్నారు. సంతమార్కెట్, రంగరాజుపేట, సభాపతిరోడ్, రామాలయం, కుమ్మరివీధి, పెద్దమ్మగుడి, పాండురంగస్వామి దేవాలయం, గాంధీనగర్, బీఎస్ఎన్ఎల్ టవర్, బసిరెడ్డిబావి వీధి, దాసరివీధి, చిన్నబారం ఇమాం చావిడి, సంతపేట, ఎస్ఎల్‌వీటీ, గుద్దేటివీధి, చాకలిపేట, శ్రీవిద్యస్కూల్, నాగులకట్ట, కరెంట్‌ఆఫీస్, సాయినగర్, సీతారాంనగర్, పాత పోస్టాఫీస్, సాయినగర్, పాతశివాలయం, ఏకలవ్యనగర్, అమ్మవారిశాల, గాంధీసెంటర్, సుంకులమ్మ వీధి తదితర ప్రాంతాల్లో 61 చోట్ల వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను కొలువుంచారు. మంగళవారం ఆయా కాలనీలకు చెందిన భక్తులు మండపాల వద్ద స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

సభ్యులు లేకుండానే తీర్మానాలు చేయడం దారుణం



ఉన్నతాధికారులకు రాసిన లేఖను చూపుతున్న సర్పంచ్ యల్లమ్మ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పంచాయతీ అధికారులు సర్పంచ్, వార్డు సభ్యులు లేకుండానే తీర్మానాలు చేశారని.. వాటిని వెంటనే రద్దు చేయాలని సర్పంచ్ ఈసారి యల్లమ్మ (వైఎస్సార్‌సీపీ) మంగళవారం డిమాండ్ చేశారు. ఉదయం 11 గంటలకు పంచాయతీ సర్వసభ్య సమావేశం ఉందని పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ తనతో పాటు వార్డు సభ్యులకు తెలియజేయడంతో వార్డు సభ్యులతో కలిసి కార్యాలయానికి వచ్చామని తెలిపారు. సమావేశం నిర్వహిస్తారని సుమారు అరగంట సేపు వేచి చూసినా, ఏ అధికారి రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సర్పంచ్, వార్డు సభ్యులకు తెలియకుండానే ఉపసర్పంచ్ బురానుద్దీన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి కొన్ని తీర్మానాలు ఆమోదించడం దారుణమని పేర్కొన్నారు. టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే గ్రామ పంచాయతీ కార్యదర్శి తీర్మానాలు చేసినట్లు ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంలో సర్పంచ్ అధికారాలను హరించడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎస్టీ మహిళలను కాబట్టే తనకు ఘోర అవమానం జరిగిందని, ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సర్పంచ్, వార్డు సభ్యుల ఆమోదం లేని తీర్మానాలు రద్దు చేయాలని కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశానని తెలిపారు.



బేతంచెర్ల: బైటిపేటలో రూ.1.23 లక్షలకు లడ్డూ దక్కించుకున్న రంగుపెద్ద పుల్లయ్య

వెళ్లిరా వినాయకా



బేతంచెర్లలో వినాయకుడి శోభాయాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు

బేతంచెర్ల: పట్టణంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు అంబరాన్నంటాయి. గణనాథుని శోభా యాత్రలో చిన్నాపెద్దా.. మహిళ, ముసలి అంతా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. రంగలు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. గణేష్ ఉత్సవ కేంద్ర సమితీ ఆధ్వర్యంలో 41 చోట్ల వినాయకులను కొలువుంచారు. నాలుగు రోజుల పాటు పూజలు నిర్వహించి మంగళవారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ముందుగా స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించారు. పాతబస్టాండ్, అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి, గౌరిపేట, మెయిన్ బజార్, ప్రధాన రహదారి వెంట గణపతి బప్పా మోరియా, గణేష్ మహరాజ్‌కు జై నినాదాలతో హోరెత్తించారు. వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య బొజ్జ గణపయ్యల శోభా యాత్ర సాగింది. అనంతరం కర్నూలు రహదారిలోని వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు. బైటిపేటలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రంగుపెద్ద పుల్లయ్య రూ. 1,23,500కు దక్కించుకున్నారు. సర్వజన గణేష్ వద్ద 3 లడ్డూలను ఆర్ఆర్.రామనాయుడు, మధు, అరుణ్, సుబ్బరావు, శంకర్ రూ.1,90,000, భోళా గణేష్ లడ్డూ రూ. 74 వేలు, అంగళ్ల బజారులోని లడ్డూ రూ. 78 వేలు పలికింది. బైటిపేట, సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయకుల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. జనంతో ఆయా వీధులు కిక్కిరిసోయాయి. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, బేతంచెర్ల సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. ఉత్సవ సమితీ సభ్యులు హుసేన్‌రెడ్డి, మారుతి కృష్ణ, బుగ్గన చంద్ర మౌలీశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, అన్నారావు, నాగమోహన్, నాగేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ,శ్రీనివాసులు పాల్గొన్నారు.







బేతంచెర్ల అమ్మవారి శాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, వినాయక ఘాట్‌లో నిమజ్జనం, డోన్: గుత్తి రోడ్డులో కరెన్సీ అలంకరణలో వినాయకుడి మండపం

సత్యసాయి ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

డోన్ రూరల్: డోన్ మీదుగా వెళ్లే శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును పొడిగించినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి హౌరా నుంచి శ్రీసత్యసాయి వెళ్లే రైలును(22831) యశ్వంత్‌పూర్ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్ నుంచి హౌరా(22832) వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డోన్ టౌన్: పట్టణంలో బుధవారం జరిగే వినాయక విగ్రహాల శోభాయాత్ర కారణంగా ఆయా మార్గాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలు ఊరేగింపుగా వెళ్లే మార్గాలతో పాటు డోన్ పట్టణ సబ్‌స్టేషన్, పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్- 1 టౌన్- 2, హైవే ఫీడర్ కింద మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించొద్దు

డోన్ టౌన్/డోన్ రూరల్/బేతంచెర్ల: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపి పూర్తి సామర్థ్యంతో నడపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డోన్, బేతంచెర్లలో నిరసనలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు శివరామ్, రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్, అన్వర్, వెంకటేశ్వర్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గన చొరవతోనే రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతోనే రైల్వే స్టేషన్ నుంచి సంజీవనగర్ కాలనీలోకి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరైందని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముర్తుజావలీ, గూని నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మార్చి 11న సమస్యను సికింద్రాబాద్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ దృష్టికి తీసుకెళ్లి ఆర్అండ్‌బీ రహదారి నుంచి రైల్వే ట్రాక్‌పై కాలనీల్లో వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించారని తెలిపారు. అలాగే సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీ వాసులకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించడానికి రైల్వే బ్రిడ్జి కింద పైపు లైన్ వేసుకోవడానికి అనుమతులు తెచ్చారన్నారు.

జాబ్ మేళాలో 86 మందికి ఉద్యోగాలు

డోన్ టౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించారు. ఐదు కంపెనీలకు చెందిన ప్రతినిధులు 215 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 86 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న తెలిపారు. ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సర్వీసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు అందజేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.